ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024



ఇసుక యార్డ్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : సురాయపాళెంలోని ఇసుక యార్డును కలెక్టర్ ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని సూరాయపాలెం ఇసుక యార్డులో క్షేత్రస్థాయిలో ఇసుక పంపిణీ విధానాన్ని పరిశీలించారు. పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇసుక రవాణాకు వచ్చిన టిప్పర్ డ్రైవర్లతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇసుకను ఎవరు బుక్ చేసుకున్నారు,ఎక్కడికి తీసుకెళ్తున్నారు, లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుంది మొదలైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొదలకూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. మద్యం పాలసీ కి సంబంధించి మద్యం దుకాణాల కేటాయింపునకు జరుగుతున్న దరఖాస్తుల ప్రక్రియను ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వరరావును అడిగి తెలుసు కున్నారు.

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

క్యాడర్‌కు క్యాష్.. మద్యం ప్రియులకు వాష్..!

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో హడావుడి చేస్తుంది. గత ప్రభుత్వం ధరలు పెంచి, పేద, సామాన్య మద్యం ప్రియులు నడ్డి విరిచారు. అప్పులు, ఇంట్లో సామాన్లు తాకట్టు వంటి చర్యలకు పాల్పడ్డారు. నేటి ప్రభుత్వం మద్యం సరసమైన ధరలకు ఇస్తామంటూ ఊరిస్తోంది. జిల్లాలోని 182 మద్యం షాపులకు నేడు దరఖాస్తు చేసుకోడానికి చివరి రోజు. గురువారం సాయంత్రానికి జిల్లా వ్యాపితంగా 2,825 దరఖాస్తులు వచ్చాయి. నేడు సుమారు మూడు వేల దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. టిడిపి నేతలు క్యాడర్‌కు షాపులు ఇప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి పి.నారాయణ క్యాడర్‌కు షాపుల దరఖాస్తుల కోసం రూ. 2 కోట్లు ఇచ్చినట్లు తెలిసింది. లాటరీ ద్వారా షాపులు దక్కించుకొని భారీగా మద్యం అమ్మకాలు చేసి, ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

- 182 షాపులకు 2,825 దరఖాస్తులు
- నేడు నామినేషన్‌కు చివరి రోజు
- ప్రభుత్వానికి రూ.60 కోట్లు ఆదాయం
- 14న షాపులకు డ్రా కేటాయింపులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో సామాన్యులు, పేద, మధ్య తరగతి కుటుంబాల్లో మద్యం చిచ్చుపెట్టనుంది. జనం చేత భారీగా తాగించి, ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూర్చాలనే ఉద్దేశంతో పావులు కదుపుతోంది. పాలసీ, ధరలు ఎలా ఉంటాయో తెలీదు కాని, సామాన్యుల జేబుకు మాత్రం చిల్లులు పడడం ఖాయంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతలు, కార్యకర్తలు మంత్రులు, ఎంఎల్ఎలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. "మేం గత ప్రభుత్వంలో భారీగా నష్టపోయాం. ఇప్పుడు మన ప్రభుత్వంలో పది రూపాయలు సంపాదించుకుంటాం. మద్యం షాపులు మాకు ఇప్పించండి, లేదా షాపులు దక్కినవారి వద్ద కొంత షేర్ ఇప్పించండి " అంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దశలవారీగా మద్యం షాపులు తొలగించి, ధరలు తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం మద్యం ద్వార భారీ ఆదాయం సంపాదించేలా చూస్తుంది. 2014-19లో టిడిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో మద్యం ఆదాయం రూ.12 వేల కోట్లు కాగ, 2019-22 మధ్య కాలంలో వైసిపి ప్రభుత్వం మద్యం ఆదాయం రూ. 24 వేల కోట్లు, అంటే ఇందులో సగం పేద, మధ్య తరగతి చేత మద్యం తాగించి ఆదాయం తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే బాట పడుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి నేతలు, కార్యకర్తల ఒత్తిడి తట్టుకోలేని మంత్రి పి. నారాయణ తన నియోజకవర్గంలో సుమారు వంద మంది నాయకులు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోడానికి ఆయనే డబ్బులు సమకూర్చారు. అంటే ఒక్కో దరఖాస్తు రూ. 2 లక్షలు, సుమారు రెండు కోట్లు ఆయన పంపిణీ చేసినట్లు తెలిసింది. వంద మందిలో లాటరీ పద్ధతిలో ఎంత మందికి షాపులు వస్తే, అందులో నాయకులు, కార్యకర్తలకు ఆదాయం పంచేలా ప్రణాళిక తయారు చేసినట్లు తెలిసింది. నగరంలో 10 మద్యం షాపులిచ్చారు. ఇందులో అన్నీ వచ్చినా ఆశ్చర్యపోలేం. గతంలో మద్యం వ్యాపారులు మాత్రమే ఈ రంగంలో అడుగుపెడుతుండగా, తాజాగా టిడిపి, బిజెపి, జనసేన నేతలు మద్యం ఆదాయం కోసం పోటీపడుతున్నారు.

నేడు దరఖాస్తులు చివరి రోజు..!

జిల్లాకు 182 షాపులకు నేడు దరఖాస్తు చేసుకోడానికి చివరి రోజు. గురువారం రాత్రికి జిల్లా వ్యాపితంగా 2825 దరఖాస్తులొచ్చాయి. ఒక్కో దరఖాస్తుదారుడు రూ.2 లక్షల రూపాయలు నగదు చెల్లించారు. ఇది నాన్‌రీఫండ్‌బుల్. నేడు వచ్చివాటితో సుమారు మూడు వేల దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.60 కోట్లు ఆదాయం రానుంది. నెల్లూరు నగరంలో 10, బుచ్చి, కావలి, ఎనిమిది షాపులు, కందుకూరు పట్టణంలో ఏడు, అల్లూరు, ఇందుకూరు పేట, కొడవ లూరు, పొదల కూరులో ఆరుషాపులు, ఆత్మకూరు, బోగోలు, కందుకూరు రూరల్, మనుబోలు, సైదాపురం, టిపి గూడూరు, వెంక టాచలం, విడవ లూరులో ఐదు షాపులు, కోవూరు, ఉదయ గిరి, ఉలవపాడు, వింజ మూరు, నాలుగు షాపులు, ఎఎస్‌పేట, అనంతసాగరం, చేజర్ల, జలదంకి, మూడు షాపులు కేటాయించారు. 12, 13తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14వ తేదీ కస్తూరిభా కళాక్షేత్రంలో డ్రా , అనంతరం సెలక్షన్ జాబితా వేయనున్నారు. ఈ షాపులు దక్కించుకోడానికి టిడిపి నేతలు, మద్యం వ్యాపారులతో పోటీపడుతున్నారు.

'ఉపాధి' నిధులు స్వాహా

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరు మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ. రూ. 5 లక్షలకు పైబడి నిధులు స్వాహా జరిగినట్లు పీడీ గంగా భవాని బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశం ప్రజా వేదిక జరిగింది. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి 2024 మార్చి వరకు జరిగిన రూ. 20 కోట్ల విలువైన పనుల్లో పనులు చేయకుండా నిధులు స్వాహ చేసినట్లు అధికారుల తనిఖీ ద్వారా తేలినట్లు తెలిపారు. చేవూరులో రూ. లక్షల పైగా నిధులు స్వాహా చేయడంతో చేవూరు ఫీల్డ్ అసిస్టెంట్ హిమాయాలను సస్పెండ్ చేసినట్లు పీడీ వెల్లడించారు. స్వాహా చేసిన నిధులను వెంటనే రికవరీ చేయాలని, లేనిపక్షంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండలంలో 23 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరగ్గా 19 గ్రామాల్లో నిధులు స్వాహ చేసినట్లు పిడి తెలిపారు. ఎపిడి బాబురావు ఎంపీడీవో వై వెంకటేశ్వర్లు విజిలెన్స్ అధికారిని విజయలక్ష్మి తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్

రమేష్ కుటుంబానికి 'బుర్రా' పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని మాచవరం వైసిపి నాయకులు పాటీ రమేష్ మాతృమూర్తి 'పాటీ సరసమ్మ ఇటీవలే మరణించారు. కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మాచవరం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

ఉచిత ఇసుక పాలసీ హామీని

అమలు చేయాల్సిందే..!

వైసిపి నిరసనలు

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా ఇసుక అందజేస్తామంటూ ఆర్భాటంగా హామీలు చేసి అధికారంలోకి వచ్చిన అనంతరం చేసిన హామీలు అమలు చేయకుండా టిడిపి నాయకులు ప్రతి ఒక్కరు ఇసుకను అందిన కాడికి దోచుకుంటున్నారని వైసిపి నేతలు ధ్వజమెత్తారు. గురువారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో వైసిపి రూరల్ ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ హామీని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లటి రిబ్బన్లు కట్టుకొని, ఇసుక ప్యాకెట్లను చేతపట్టుకోని కూటమి ప్రభుత్వానికి వినూత్న రీతిలో నిరసన,ధర్నా చేపట్టారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలే తమకు ముఖ్యమని, ప్రతి నిత్యం ప్రజల పక్షాన నిలబడతాం ప్రజా సమస్యలపై గళమెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు .కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ కోరుతూ

15న ముత్తుకూరులో సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు : ముత్తుకూరు మండల పరిధిలోని ఆదాని కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టర్మినల్ (కెపిసిటి) సాధనకై ఈ నెల 15న ముత్తుకూరులోని షాదీ మందిర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ పేర్కొన్నారు. గురువారం ముత్తుకూరు శ్రామిక భవన్‌లో విద్యార్థి యువజన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం వి రమణ. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం హర్ష మాట్లాడుతూ ముత్తుకూరు మండలంలోని అదాని కష్ణపట్నం పోర్టు కంటైనర్ టర్మినల్ సాధనకై ఈనెల 15న సాయంత్రం ముత్తుకూరులోని షాదీ మందిర్ లో జరుగు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఈ సదస్సుకి మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలన్నారు. నిరుద్యోగ యువతే కాకుండా వ్యాపారస్తులు దుకాణా దారులు హోటల్స్ యజమానులు అనేక మందికి వ్యాపారాలు లేక నష్టపోయారన్నారు. కంటైనర్ టర్మినల్ లేనందున అదాని కష్ణపట్నం పోర్టులో ప్రస్తుతం బొగ్గు బూడిద దుమ్ము ధూళి తో నిండిపోయి గ్రామాన్ని కాలుష్యం బారిన పడి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పీల్చే గాలి నేల నీరు మొత్తం కలుషితమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముత్తుకూరు షాజీ మందిలో జరుగు విద్యార్థి యువజన సదస్సును జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చరణ్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

నిత్యావసర సరుకులపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : వినియోగదారులపై భారం పడకుండా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి ఉత్పత్తి ధరకే నిత్యావసర సరుకులను ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని శంకరన్ సమావేశం మందిరంలో జిల్లాస్థాయి ధరల స్థిరీకరణ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, ఎర్రగడ్డలు, టమోటాల ధరల పెరుగుదలను అదుపులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, మార్కెటింగ్ ఎడి అనిత, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాగ్, సివిల్ సప్లయిస్ డిఎం లక్ష్మీ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, హెూల్ సేల్, రిటైల్ వ్యాపారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ను తొలగించడం దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు

దళిత సామాజిక వర్గానికి చెందిన ఆశా వర్కర్‌ను ఎటువంటి ఆరోపణ లేకుండా కేవలం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విధుల నుంచి తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నాటికి ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే దీక్షలు ఏడో రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్ కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ పథకాలను ప్రజలకు వివరించి, ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలను అందజేస్తున్న దళిత మహిళ ఆశా వర్కను ఎటువంటి ఆరోపణ లేకుండా తొలగించడం దారుణమన్నారు. గత మూడు నెలల నుండి అధికారులు దష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం చేయకుండా ఆమెను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందిటి విజయమ్మకు న్యాయం చేసి తిరిగి విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షల్లో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ ,అంగనవాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్. కె. రెహనా బేగం, సిఐటియు జిల్లా అధ్యక్షులు టివి ప్రసాద్, కె. పెంచల నరసయ్య ,ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం .రాజా మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

రిలే దీక్షల్లో ఆశా వర్కర్లు

తాత్కాలిక విరమణ

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే దీక్షలను దసరా పండగ దష్ట్యా తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం నుంచి ఈ రిలే దీక్షలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

రామాయపట్నానికే..

'బిపిసిఎల్' వచ్చేలా చూడాలి

సిఎం చంద్రబాబుకు 'ఇంటూరి' విజ్ఞప్తి

ప్రజాశక్తి-కందుకూరు : కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ రిఫైనరీని వెనుకబడ్డ కందుకూరు ప్రాంతంలోని రామాయపట్నం పోర్టు వద్ద ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సిఎం నారా చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుపార్టీలో చేరుతున్న సందర్భంగా జిల్లా మంత్రి పొంగూరు నారాయణ ఇతర శాసనసభ్యులు, నేతలతో కలిసి నాగేశ్వరావు పాల్గొన్నారు. ఆ సందర్భంగా సిఎంను కోరారు. రిఫైనరీ ఏర్పాటుకు రామయ్యపట్నం ప్రాంతం అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

ఎన్‌సిసి విద్యార్థుల రైఫిల్ షూటింగ్

ప్రజాశక్తి -కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సిసి క్యాంప్ సందర్భంగా ఈనె 9,10న ఈ క్యాంపులో శిఓణకు సంబంధించిన ఫైరింగ్ ప్రోగ్రామ్‌ను ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి వారు ప్రత్యేకంగా ఎన్‌సిసి వారికోసం నిర్మించిన ఫైరింగ్ రేంజ్ వద్ద జరిపించారు. ఈ ఫైరింగ్ రేంజ్ కందుకూరు డివిజన్ లోని ఏకైక ఫైరింగ్ రేంజ్ ప్రకాశం జిల్లాలోనే రెండవ ఫైరింగ్ రేంజ్ ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్‌సిసి క్యాడేట్లు 22 రైఫిల్ ని ఎలా హ్యాండిల్ చెయ్యాలి ,ఎలా ఫైర్ చేయొచ్చో అని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ వి.మోహన్ వివరించారు. ఎ.ఓ.సత్యనారాయణ , సబ్ మేజర్ పుష్ప రాజ్ ఆధ్వర్యంలో శిక్షణ కల్పించారు.రైఫిల్ ఫైరింగ్ లో ఎంతో మంది కాడేట్స్ తమ సత్తాచాటుకున్నారు. కార్యక్రమంలో అన్ని సౌకర్యాలను అందిస్తున్న కళాశాల యాజమాన్యం కు క్యాంప్ కమాండెంట్ కతజ్ఞతలు తెలిపారు.

రతన్ టాటాకు నివాళి

రాజా యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలం అనికేపల్లి గ్రామంలో గురువారం రాజన్న సైన్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.తొలుత భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన రాజన్న అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర , టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, మావిళ్ళపల్లి శ్రీనివాసులు నాయుడు, నెల్లూరు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సుందరయ్య యాదవ్, ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, సర్వేపల్లి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువత భారీగా హాజరయ్యారు. రాజా యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సుస్మితకు సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తూ తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి డి ఎల్ డిఒగా బదిలీపై వెళ్తున్న ఎం సుస్మిత కు వీడ్కోలు సభ నిర్వహించారు. గురువారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారి (పి.ఆర్. అండ్. ఆర్.డి)లు, జిల్లా పంచాయతీ విభాగము ఉద్యోగులు న్యూ జిల్లా ప్రజా పరిషత్ భవనము, నెల్లూరులోని గల మీటింగ్ హాల్ లో ఘనంగా సత్కరించినారు. జిల్లా విస్తరణాధికారి (పి.ఆర్.అండ్, ఆర్.డి) అసోసియేషన్ నాయకులు యం.నారాయణ రెడ్డి, యం.సాయి ప్రసాద్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ నాయకులు, జి. శ్రీధర్ చౌదరి, ముషీధర్, దొరబాబు, అశోక్, శ్రీనివాస రావు ఉన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా మృతిని పురస్కరించుకోని జనహిత వాత్సల్య అనాథ ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవి సాంబశివరావు, ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చేజర్ల సుధాకర్ రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ సూది నుంచి విమానాల తయారీ వరకు ఎన్నోప్రముఖ కంపెనీలను స్థాపించి, ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన పారిశ్రామిక వేత్త రతన్‌టాటా అన్నారు. పరిశ్రమలను స్థాపించి కోట్లాదిమందికి ఉద్యోగ ప్రదాత, గొప్ప సేవా తత్వరుడు, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచితంగా అనేక క్యాన్సర్ ఇతర హాస్పిటల్స్ ఏర్పాటు చేసిన మహనీయుడన్నారు.జనహిత వాత్సల్య ఆశ్రమం, భారతీయ విద్యా వికాస్ స్కూల్ అధ్యాపకులు పిల్లలు, ఆశ్రమ సిబ్బంది మల్లికార్జున గిరి తదితరులు పాల్గొన్నారు

రతన్ టాటా మృతి తీరని లోటు

మంత్రులు, ఆనం, నారాయణ

కేవలం పారిశ్రామికవేత్త గా మాత్రమే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన అదర్శవాది అయిన రతన్ టాటా జీవితం అందరికీ ఆదర్శవంతం కావాలని, ఆయన మృతి దేశానికే తీరని లోటని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్రికలకు రతన్ టాటా మృతికి సంతాప ప్రకటన విడుదల చేశారు. విద్య,వైద్యం వంటి రంగాల్లో రతన్ టాటా సేవలు అద్వితీయమన్నారు. కేవలం మన దేశంలోనే కాకుండా 100 కు పైగా దేశాల్లో అనేక పరిశ్రమలు స్థాపించి అనేకమందికి ఉపాధి చూపించిన మహోన్నతుడు అని కొనియాడారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు : తల్లి అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవీ నవరాత్రి ఉత్సవాల ఆలయ ఇఒ కష్ణవేణి ఆధ్వర్యంలోఎంతో వైభవంగా జరుగుతున్నాయి.ఎనిమిదవరోజు గురు వారం శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు.. ఉభయ దాతలు తీగల మధుసూదన శివరామకష్ణ ధర్మపత్నిగంగాభవాని, సోడా నారాయణ ధర్మపత్ని లక్ష్మీ కుమారి, చల్లా వెంకట జాలయ్య ధర్మపత్ని సుభాషిణి,సూరం రామిరెడ్డి ధర్మపత్ ఈశ్వరి, పాలెపు రమేష్ ధర్మపత్ని అనూష అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో 'ఇంటూరి' తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను గురువారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల , ఆహారం విషయాలపై ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్ ను పరిశీలించి దూర ప్రాంత ప్రజలకు పగటిపూట వైద్యం అందే విధంగా చూడాలని వైద్యులకి సూచించారు.ఆస్పత్రి సూపర్నెంట్ శకుంతల తో మాట్లాడి వైద్యులు, సిబ్బంది ఎంతమంది ఉండాలి ఎంతమంది ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సిబ్బంది కొరత ఉన్నట్లయితే పై అధికారులతో మాట్లాడి వారి నియామకానికి కషి చేస్తానని తెలిపారు. పేదల వైద్య విషయంలో రాజీ పడవద్దని సూపరింటెండెంట్ శకుంతలకు ఎంఎల్ఎ సూచించారు. పట్టణానికి చెందిన బొగ్గవరపు నరసింహులు ఆసుపత్రిలోని వైద్య పరికరాల కొనుగోలుకు రూ. 2 లక్షలు అందజేశారు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి లో పేదలకు అందించే వైద్యం విషయంలో వ్యాపారస్తులు ప్రముఖులు, ముందుకు వచ్చి ఆస్పత్రి అభివద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, అల్లం వెంకటేశ్వర్లు, మధిర మధు, మురారి శెట్టి సుధీర్ ఉన్నారు.

'దామిశెట్టి'కి వైసీపీ నాయకుల పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి

ప్రజాశక్తి-కావలి: దుండగుల దాడిలో గాయపడి నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వైసిపి సీనియర్ నాయకులు దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు తమ్ముడు మల్లికార్జున్ రావును కావలి మాజీ ఎం.ఎల్.ఏ. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి మాజీ శాసన సభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ రెడ్‌బుక్ పరిపాలన ప్రారంభమైందన్నారు. దామిశెట్టి మల్లికార్జున రావును బుధవారం వాళ్ళ వేపకాయల మిల్లువద్దకు పోయి, ముసుగులు వేసుకుని వచ్చి, భౌతికంగా దాడీ చేసి, కొట్టి గాయపరచి వెళ్ళి పోయారని తెలిపారు. దీన్ని చూస్తే, జగనన్న చెప్పినట్లు టిడీపీ దాడులకు ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు కూడా రెడ్ బుక్ లు తెరుస్తారని అన్నమాట నిజం కాబోతున్నట్లు తెలిపారు. తమపార్టీ నాయకులపై దాడులు చేస్తుంటే తాము కూడా వీధి పోరాటాలకు సిద్ద పడతామని హెచ్చరించారు. మాజీ శాసనసభ్యులు ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కార్యకర్తలపై దాడి చేసినవారిపై ప్రతిఘటన చేస్తామని హెచ్చరించారు. ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి , వైసీపీ నాయకులు సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని, పరామర్శించారు.

సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి: ఏపిఎస్ఆర్‌టిసి, కావలి డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ప్రయాణికులు తమ దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఉదయం11నుండి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 16 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు, అభ్యర్థనలు తెలిపారు. వారి కోరికపై అల్లూరు గ్రామంలో బస్సు రాకపోకల సమయాల బోర్డు ఏర్పాటు,కొమ్మిపాడు హైస్కూల్ కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా కొండాపురం బస్సు సమయమార్పడం, వేములపాడు బస్సు ,కప్పాపాడు గ్రామంలోకి పొడిగించడం, తదితర విషయాలపై వెంట నే చర్యలు తీసుకున్నారు. పామూరు, చాకలికొండ గ్రామాలకు సర్వీసులు డిపోకు కొత్త బస్సులు రాగానే ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు.

మాట్లాడు తున్న డిపో మేనేజర్

12న బీసీ ఐక్యత భవన్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి: పట్టణంలోని కో-ఆపరేటివ్ కాలనీలోని"బిసి ఐక్యత భవన్"ను ఈ నెల 12 వ తేదీ శనివారం 10గంటలకు ప్రారంభోత్సవం జరుపుతున్నారని బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్య క్షులు అడ్డంకి ప్రభాకర్ రావు, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవింద,ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్ రావు తెలిపారు.గురువారం స్థానిక జర్నలిస్టు బందుమీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీశనివారం ఉదయం 10 గంటలకు జరిగే బీసీ ఐక్యత భవన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కావలి నియో జకవర్గ శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు.

ప్రమాదాల నివారణకు సూచిక ద్రమ్ములు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించి గమ్యం చేరుకోవాలని డిఎస్‌పి కె. వేణుగోపాల్ అన్నారు. గురువారం ఎస్‌ఐ కృష్ణ కాంత్ ఆదేశాలతో ఆత్మకూరు పోలీసులు నెల్లూరు పాలెం ముంబై-నెల్లూరు జాతీయ రహదారిపై ప్రమాదాలు అరికట్టడానికి ఆలోచనలో ఆత్మకూరు డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ గంగాధర్ రావు, ఎస్ఐ జిలాని ఈ ప్రాంతంలో ద్రమ్ములు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ప్రధాన ఏరియాల్లో ద్రమ్ములతో వేగ నివారణకు చర్యలు చేపట్టామన్నారు. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించి గమ్యం చేరుకోవాలన్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని అది ప్రాణానికే ప్రమాదం అని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసుల రెడ్డి, కేశవులు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయింది..

ప్రజాశక్తి-కావలి: ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా లాంటి ఒక గొప్ప వ్యక్తిని మన దేశం కోల్పోయిందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నటికీ చెరగని తన ఇంటి పేరును మాత్రం ఈ దేశానికి వదిలేసి ఆయన తనువు చాలించారన్నారు. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి కొన్ని లక్షల కోట్ల మంది జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడిని ఈ దేశం కోల్పోయిందన్నారు. ఆయన ఏ వ్యాపారం చేసినా సమాజ హితం కోసం విలువలతో కూడిన వ్యాపారాలు చేశారని, సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడ్డారన్నారు. వంట గదిలో వాడే ఉప్పు నుంచి విమానాల తయారీదాకా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి నిస్వార్థంగా వ్యాపారం చేసిన రతన్ టాటా మరణం ఈ దేశానికి తీరని లోటని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరుకుంటూ ఉన్నామని తెలిపారు.

ప్రజాశక్తి-బిట్రగుంట

ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా లాంటి ఒక గొప్ప వ్యక్తిని మన దేశం కోల్పోయిందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు లేళ్ళపల్లి సురేష్ బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నటికీ చెరగని తన ఇంటి పేరును మాత్రం ఈ దేశానికి వదిలేసి ఆయన తనువు చాలించారన్నారు. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి కొన్ని లక్షల కోట్ల మంది జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుణ్ణి ఈ దేశం కోల్పోయిందన్నారు.

డాక్టర్‌ను నియమించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు పశువైద్య కేంద్రం లో గత ఆరు నెలలుగా వైద్యుడు లేక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బోగోలు మండల వైసిపి అధ్యక్షులు మద్దిబోయిన వీర రఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బోగోలు మండల పరిధిలోని కొండబిట్రగుంట, విశ్వనాథరావుపేట, నాగులవరం, జక్కుల్లి గూడూరు, ఏపీ కండ్రిక, ఎస్సీవి కండ్రిక తదితర గ్రామపంచాయతీలో సుమారుగా రెండువేల కు పైబడి మూగజీవాలు ఉన్నాయన్నారు. పశువులకు మూగజీవాలకు వైద్య సదుపాయాలు అందించడంకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అనేక పాడి ,పశువులు , మూగజీవాలు అనేక రకాల వ్యాధులతో బాధపడుతూ మృత్యువాత పడుతున్నాయన్నారు. బోగోలు పశువైద్య కేంద్రంలో పశు వైద్యుని నియమించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఇంటర్ షిప్‌పై అవగాహన

ప్రజాశక్తి-దగదర్తి: స్థానిక జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పై అక్టోబర్ మూడవ తేదీ నుండి ఇంటర్‌షిప్ ఉన్నట్లు తెలిపారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 పిఎం శ్రీ ఇంటర్న్‌షిప్ స్కీమ్ పథకాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు. దగదర్తి జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల నుండి 38 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యారు. సమగ్ర శిక్షణ స్కిల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ తరుపున విసి పి కార్తిక్, వి సి బి శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-జలదంకి: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని జలదంకి మండల పరిషత్ అధ్యక్షులు గోచి పాతవెంకటరమణయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అలసత్వం ప్రదర్శించకుండా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల ఈ మండలానికి బదిలీపై వచ్చిన ఎంపీడీఓ గా బాధ్యత చేపట్టిన అధికారులను ఆయన ప్రశంసించారు. అనంతరం ఈ మండల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి తగిన సూచనలు సలహాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. బ్రహ్మయ్య, మండల ఉపాధ్యక్షులు పాలవల్లి మాలకొండా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జూలియా భాయ్, అన్ని శాఖ అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

ప్రజాశక్తి-వింజమూరు

ఈ మధ్యకాలంలో రోజు రోజుకి పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని స్థానిక పొదుపు మహిళా సంఘాల నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగడ్డలు, పప్పు ధాన్యాలు, వంటనూనె, టమోటాలు అన్ని రకాల కూరగాయలు ధరలు అన్ని విపరీతంగా పెరిగిపోయి పేద మధ్యతరగతి సామాన్య ప్రజలు కొని తినే పరిస్థితి కనిపించడం లేదని వాపో తున్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అన్ని రకాలు పంపిణీ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూడా ఏమి ఇవ్వకుండా కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తూ కాలం గడిపేస్తుందన్నారు. ఈ రేషన్‌లో నిత్యావసర సరుకులు ఇస్తే పేద ప్రజలం దరికీ ఎంతగానో ఉప యోగపడుతుంద న్నారు. దీని ద్వారా జీవనం ఇబ్బందులు లేకుండా సాగించుకోవచ్చునని తెలిపారు. కొంతమంది చిల్లర దుకాణదారులు వంటనూనె, ఎర్రగడ్డలు, పప్పు ధాన్యాలను గత కొన్ని నెలలుగా నుండి నిల్వలు చేసుకుని అధిక రేట్లు అమ్ముతూ ప్రజల జేబులోకి చిల్లి కొడుతున్నారని తెలిపారు. ఇవన్నీ తెలిసినా కూడా కొంత మంది అధికారులు వారి వద్ద నుంచి లంచాలు తీసుకుంటూ ఇష్టాను సారంగా ధరల పెంచుకున్న కూడా ఏమి పట్టీ నట్టు వ్యవహరి స్తున్నారని అంటు న్నారు. రైతుల వద్దకు వెళ్ళి అన్ని రకాల నిత్యావసర సరుకులు, కూరగాయలను తక్కువ ధరలకే తెచ్చి మార్కెట్లో ప్రజలకు ఎక్కువ రేట్లు అమ్ముతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలలో రైతు బజార్ ను ఏర్పాటు చేసి వీటి ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి నిత్యావసర సరుకులు ధరలను వెంటనే తగ్గించాలని ఎక్కువ రేట్లకు అమ్ముతున్న దుకాణాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి దుకాణం దగ్గర ధరల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు.కార్యక్రమంలో పొదుపు సంఘ గ్రూపు మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

దొంగలతో బెంబేలు..

-చేపల గుంతలే టార్గెట్.
-ఆక్వా రైతుల ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గిట్టుబాటు ధర లేక అంతంత మాత్రమే జీవితాన్ని నెట్టుకొస్తున్న ఆక్వా రైతులకు డీజిల్ దొంగలు మరింత నష్టాల్లోకి నెట్టి వేస్తున్నారు. మండలంలోని దామంమడుగు, రేబాల సమీపంలోని పంచాయతీల పరిధిలో చేపల సాగు చేస్తున్న ఆక్వా రైతులకు డీజిల్ దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. చేపల సాగు గుంతలో చేపల కోసం ఆక్సిజన్ అందించేందుకు ఏర్పాటుచేసిన ఏరియేటర్లు పనిచేసే పరికరాలకు వినియోగించే డీజిల్‌ను దొంగలు చోరీ చేస్తున్నారు. ఆక్వా రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. రాత్రివేళ చేపలగుంతల వద్దకు వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు గుంతలపై ఉన్న డీజిల్ డబ్బాలను చోరీ చేసుకుని వెళ్లిపోతున్నారని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆక్వా సాగు నష్టాల్లో ఉండగా దుండగులు గుంతల వద్ద ఉన్న డీజిల్ డబ్బాలు చోరీ చేసి తీసుకెళ్లడంతో తమ పరిస్థితి మరింత దారుణంగా మారిందని కొందరు రైతులు వాపోయారు. ఇలా జరగడం కొత్త ఏమి కాదు ఎన్నోసార్లు జరుగుతున్నాయని వారు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ తమ కళు గప్పి దొంగలు డీజిల్ డబ్బాలు చోరీ చేసి తీసుకెళ్తున్నారని ఆవేదన చెందారు.ఇకనైనా తమయందు దయ ఉంచి డీజిల్ దొంగలను పట్టుకునేందుకు దృష్టి సారించాలని సంబంధిత పోలీసు వారిని ఆక్వా రైతులు కోరారు.

వసతి గృహాన్ని మోడల్ విద్యాసంస్థగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-నెల్లూరు

ఎంతో పేరు ప్రఖ్యాతలు గల మహమ్మదాపురం బీసీ బాలుర వసతి గృహాన్ని మోడల్ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం పొదలకూరు మండలం, మహ్మదాపురం దొడ్ల శంకరమ్మ బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. దాతలు దొడ్ల కుటుంబ సభ్యులు సొంత నిధులతో ఇంత పెద్ద పాఠశాలను ఈ గ్రామంలో నిర్మించడం జిల్లాకే గర్వకారణంగా కొనియాడారు. ప్రభుత్వం పరంగా అవసరమైన నిధులను సమకూర్చి ఈ విద్యా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ బాలపర వసతి గృహం ఆవరణలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం, సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యా సంస్థలను అన్నింటినీ కలిపి అన్ని వసతులతో మోడల్ విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు అవసరమైన ల్యాబ్స్, క్రీడా ప్రాంగణాలు ఇతర మౌలిక వసతుల ను కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామస్తులందరూ ఈ గొప్ప కార్యక్రమంలో తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. తొలుత బీసీ బాలల వసతి గృహంలో నిర్మించిన నూతన భవన నిర్మాణాలను దాత దొడ్ల శేషారెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సునీత, విద్యా కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

పసుపులేటి అడ్రస్ ఎక్కడ..?

ప్రజాశక్తి-కావలి: కావలి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన పసుపులేటి సుధాకర్ తాను గెలిస్తే న్యాయం చేస్తా! ఓడితే సహాయం చేస్తా! అని చెప్పి ఎలక్షన్లు అయిపోయిన తరువాత కనిపించకుండా వెళ్లిపోయారు.ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్న ఇంతవరకు ఆయన అడ్రస్ లేరు.ఎవరు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమైనా రెండు సార్లు కావలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయారు. ఆయన అడ్రస్ లేకపోవడంతో ప్రజలు పలువిధాలుగాచర్చించు కుంటున్నారు.గెలుస్తాననే ధీమాతో అయన ప్రజలను మభ్యపెట్టారు. ఓడిపోవడంతో ముఖం చాటేసి, హైదరాబాద్ చెక్కేశారు. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే సుధాకర్ ప్రజలకు ఎన్నికలముందు ఉచితంగా చెప్పేసిన హామీలు నెరవేర్చకపోతే తగిన బుద్ధిచెప్పగలరు. ఇకనైనా సుధాకర్ కావలి ప్రజల ముందుకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం.

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ సర్పంచ్ గండూరి మంజుల ఆధ్వర్యంలో విశ్వనాథరావుపేట పంచాయతీలో విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిన పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషాకు గురువారం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గండూరి మంజుల మాట్లాడుతూ పంచాయతీలో విధి నిర్వహణలో ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా అని ,సాధారణ బదిలీల్లో భాగంగా విశ్వనాథరావుపేట పంచాయతీలో పనిచేస్తున్న అన్ని శాఖల సిబ్బంది వారు కావలి తదితర ప్రాంతాలకు బదిలీ అయి వెళ్లారని తెలిపారు.

సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-విడవలూరు: మండలంలోని 15 పంచాయతీల సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు రెండవ రోజు గురువారం ఎంపీడీఓ నగేష్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు అన్ని గ్రామ పంచాయతీలలో పరిశుభ్రంగా ఉంచి తాగునీరు అందించాలని తెలిపారు. అనంతరం మండలంలోని 15 పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేయడం జరిగింది.

మానసిక ఆరోగ్యం పై అవగాహన

ప్రజాశక్తి-కావలి:సమాజంలో ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం పై అవగాహన పెంచుకొని వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం మాలకొండారెడ్డి పేర్కొన్నారు.ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నేటి తరం ఇంటా బయట అనేక ఒత్తిడి గురవుతూ అనారోగ్యంకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులు యువత శారీరకవ్యాయామం చేస్తూ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించు కుంటూ ద్వేషం,కసి లేని ఒత్తిడిలేని జీవన విధానాన్ని పెంపొందించుకొని శారీరకంగా మానసికంగా ఆనందంగా జీవించాలని కోరారు. మానసిక వైద్య నిపుణుల సలహాలు సూచనలు తీసుకొని సమస్యలను అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంత మైన జీవన విధానాన్ని అభివృద్ధి చేసుకొని జీవించాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: మొక్కలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని, ఆనందాన్నిస్తాయని మండల విద్యాశాఖ అధికారి పాతపాటి వెంకటరత్నం పేర్కొన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురు వారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల విద్యా శాఖ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ వర్ణంపై దృష్టి నిలిపితే మానసికంగా ప్రశాంతంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమ ంలో ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం

వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి-బిట్రగుంట: అల్లూరు మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాం గురువారం జరిగింది. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ రజినీకాంత్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి కార్యక్రమాల పట్ల వార్డు మెంబర్లకు, ఉపసర్పంచులకు వాటి పట్ల మరింతగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిపాలన పద్ధతులు తెలుసుకోవడానికి కామన్ మినిమం అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం పై అందరికీ అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.

దుర్గాదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని శివాలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుండి అమ్మవారి గుడి ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారిని దుర్గాదేవి అలంకరించి పల్లకి సేవలో ఊరేగింపు చేశారు. ముందుగా ఉదయాన్నే మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో బాణా సంచాల కాల్చుకుంటూ దేవస్థానమునకు తీసుకెళ్లారు. ప్రజాశక్తి-విడవలూరు మండల కేంద్రంలోని అంకమ్మ గుడిసెంటర్లో దేవి శరన్నవరాత్రుల ఘనంగా జరుగుతున్నాయి. గురువారం దుర్గా దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు ప్రతిరోజూ ఒక్కొక్క అలంకరణలో ప్రజలకు దర్శనమిస్తూ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. భక్తులకు సంతాన తల్లిగా దర్శనం ఇచ్చారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

స్థానిక మండలంలోని జొన్నవాడ గ్రామంలో పినాకిని నది తీరాన కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం 8వ రోజు మహాదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆర్య భూమి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. హైదరాబాద్ వాస్తవ్యులు కామినేని రాజేశ్వర రెడ్డి వెంకట శేషమ్మ దంపతులు ఉభయకర్త లుగా వ్యవహరించారు.

మద్యం షాపుల కోసం 115 దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి సర్కిల్ పరిధిలో మద్యం షాపుల కోసం బుధవారం నాటికి 115 దరఖాస్తులు వచ్చినట్లు సిఐ తన్నీరు లక్ష్మణ్ స్వామి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయగిరి మండలంలో 3 షాపులకు 17, సీతారాంపురం మండలంలో 2 షాపులకు గాను 17, దుత్తలూరు మండలంలో 2 షాపులకు గాను 41, మర్రిపాడులో 5 షాపులకు గాను 40 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రేపు సాయంత్రం 7 గంటల లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 12వ తేదీ 13వ తేదీల్లో దరఖాస్తులు వెరిఫికేషన్ జరుగుతాయని 16న షాపులు ఓపెనింగ్ అవుతాయని తెలిపారు.

ఎంపీడీఓలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంపీడీఓగా అప్పాజీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కలిగిరి ఎంపీడీఓ కార్యాల యంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతలపై ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల సమస్యలపై వెంటనే స్పందించి సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పంచాయతీ సమస్యలు అభివృద్ధి పనులపై సచివాలయాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బందితోపాటు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ అందిస్తున్న పథకాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నవాజ్, జూనియర్ అసిస్టెంట్ సమద్, ఆపరేటర్ ఇమ్రాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు ఎంపిడిఓగా వేణుగోపాల్ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన వరికుంటపా డులో ఏఓ గా విదులు నిర్వ హి స్తూ ఎంపి డిఓగా ఉన్నతాధికారుల నుంచి నియామక ఉత్తర్వులు రావ డంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఓ గా ఉన్న ఎన్. మల్లికార్జున బదిలీ పై దుత్తలూరు ఇఓపిఆర్‌డి గా వెళ్లారు.ఆయన గతంలో ఉదయ గిరిలో ఇఓపిఆర్‌డిగా పని చేస్తూ వరికుంటపాడు ఇన్‌ఛార్జి ఎంపిడిఓ గా చేస్తున్నారు.సాధారణ బదిలీలో భాగంగా దుత్తలూరు ఇఓపిఆర్‌డిగా బదిలీపై వెళ్లారు. ఎన్. మల్లికార్జునను పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సత్కరించి సన్మానించారు.

ప్రజాశక్తి-కోవూరు

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చిలకల శ్రీ హరి రెడ్డిని టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కోవూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చెంబెటి పెంచలయ్య, బాల రవి, ముసలి సుధాకర్, నాటకరాణి వెంకట్, బత్తల రమేష్ యాదవ్, షేక్ మసూద్ అహ్మద్‌లున్నారు.

ప్రజాశక్తి-జలదంకి

మండల ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జలదంకి మండలం ఉపాధ్యక్షులుపాలవల్లి మాలకొండా రెడ్డి గురువారం సన్మానించారు. ఎంపీడీఓను కలిసి ఆయనకు పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. రాజకీయాలు అతీతంగా ప్రజా సమస్యలే పరిష్కారం దిశగా పనిచేయాలని కోరారు.

ఉద్యోగోన్నతులు, బదిలీలు జరపాలి

ప్రజాశక్తి-కావలి: పురపాలక అంతర్ జిల్లా బదిలీలు, ఒకే జిల్లాలో మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్‌కు బదిలీల అవకాశం కల్పించాలని, ఉద్యోగోన్నతులు జరపాలని పురపాలక ఉపాధ్యాయులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పురపాలకఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణని మంగళగిరి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి, ఖచ్చితంగా జెడ్పీటీచర్లు తో పాటు ఏప్రిల్,మేలలో జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టి.కొండారెడ్డి, బి.సరళ, .బి.కిరణ్.కుమార్, వై.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, కృష్ణజా, సౌందర్య, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న దాత

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడులో బొగ్గుబట్టీల వద్ద పని చేస్తున్న కూలీలకు వినియోగ దారుల ఫోరమ్ ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో గురువారం దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా నిరుపేదలైన గిరిజనులు కూడా పండుగను జరుపుకోవాలని దృఢసంకల్పంతో దాతలు ప్రకాశం జిల్లా పామూరు పట్టణం కు చెందిన దర్శి సత్యనారాయణ ఓపోలు శివ సహకారంతో దుస్తులను సేకరించి వీరికి అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ధనెంకుల వెంకట నవీన్, పొద మల్లికార్జున, మట్టే నరేష్, నిఖిల్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భ్రూణహత్యలు నివారించాలి

ప్రజాశక్తి-కావలి: డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ సహకారంతో కావలి రాజీవ్ నగర్ పి.హెచ్.సి. ఆధ్వర్యంలో గర్భిణు లకు, బాలింతలకు వైద్య శిబిరం నిర్వహించారు. పి.హెచ్. సి డాక్టర్ ద్వారకానాథ్ చౌదరి, డాక్టర్ లక్ష్మీ గర్భిణు లకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిం చారు. తదుపరి ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలుచే యించు కోవాలన్నారు. లింగనిర్ధారణ ,లింగవివక్షత నేరం అని,ఆడ మగ బిడ్డలను సమానంగా చూడాలన్నారు. భ్రూణహత్యలు నివారించాలని, అనేకసలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్తమాల కొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అపోహలను నమ్మొద్దు

ప్రజాశక్తి-ఉదయగిరి: మద్యం పాలసీ విధానంలో వస్తున్న అపోహలు ప్రచారాలను నమ్మొద్దని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆలం శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ప్రభుత్వం పాలసీ విధానంలో చాలా పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో ఉదయగిరి వెనుకంజలో ఉందన్నారు. ఒక్కో షాపు పరిధిలో పది దరఖాస్తులు లోపు ఉంటే రీ నోటిఫికేషన్ తప్పనిసరిగా ఉంటుందన్నారు. దరఖాస్తులు లను ఆఫ్ లైన్, ఆన్ లైన్ ద్వారా స్వీకరిస్తయాన్నారు. కార్యక్రమంలో సి ఐ తన్నీరు లక్ష్మణ్ స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కలెక్టర్ ఓ ఆనంద్ ను ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గంలో పలు రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

బొకే అందజేస్తున్న దృశ్యం

In the Court of the Principal Junior Civil Judge : Gudur

E.P.No. 77 / 2023

O.S.No. 158 / 2019

Naradasu Ravi - D.H.R

Vs

Settipalli Seenaiah
Alias **Srinivasulu** - J.D.R

Notice to J.D.R

Settipalli Seenaiah, Alias **Srinivasulu,**
Velpulagunta Post, Akbarabad,
Velpulagunta, A.S. Pet Mandal,
Nellore District.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ మీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు ఆర్డరు 21 రూల్ 22 నోటీసు నిమిత్తం **తే28-10-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దాసరి ప్రసాద్, MSc., B.Ed., M.L.,
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేటు, నెల్లూరు.
సెల్: **94938 25902**

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 1017 / 2022

Canara Bank, Rep.by its Branch Manager, Koduru Branch, Nellore District. - Plaintiff

Vs

M/s. S.R.K. Transports, Rep by its Prop. Kothapalli Satish Kumar Reddy, @ Satish Reddy, S/o Janardhan Reddy, C/o CP Aqua culture India Pvt. Ltd., @ CP Hatchery Koduru Village, T.P.Gudur Mandal, SPSR Nellore District. - Defendant

Notice to Defendant

M/s. S.R.K. Transports, Rep by its Prop. Kothapalli Satish Kumar Reddy, @ Satish Reddy, S/o Janardhan Reddy, C/o CP Aqua culture India Pvt. Ltd., @ CP Hatchery Koduru Village, T.P.Gudur Mandal, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టు లో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే24-10-2024 దిన** వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.శ్రీకాంత్, B.Sc., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.